ఈ వారం ఎన్నికయిన కథ

# బ్రతుకు బుగ్గిపాలు చేసిన సారా

సుధీర్, సుభాష్

**ఆ** దివారం సాయంకాలం నాలుగు. హోటల్ చాలా రద్దీగా వుంది. పదేళ్ళ గోపి ఎంగిలి ప్లేట్లు తీసి ఒక సింక్‌లోను, కప్పు సాసర్లు గాజు గ్లాసులు ఇంకో సింక్‌లోనూ పడేసి వీలైనప్పుడల్లా వాటిని శుభ్రం చేసి సప్లయర్ టేబుల్ మీద ఉంచుతున్నాడు.

సర్రున ఒక జీప్ వచ్చి హోటల్ ఎదుట ఆగింది. ఇద్దరు పోలీసులు, ఒక రాజకీయ నాయకుడు బిరబిరా జీప్ దిగి హడావుడిగా హోటల్‌లో దూరి "అడుగో బాలకార్మికుడు" అని అరిచాడు నాయకుడు. ఒక కానిస్టేబుల్ గోపిని పట్టుకున్నాడు. "అడుగో హోటల్ యజమాని" అరిచాడు నాయకుడు. కాని స్టేబుల్ సుబ్బయ్యని పట్టుకున్నాడు.

టిఫిన్ తింటున్నవాళ్ళకి ఈ హడావుడి అర్థంకాక సంభ్రమంగా లేచి నిలబడిపోగా పోలీసులు గోపి, సుబ్బయ్యలను లాక్కుపోయి జీప్ ఎక్కించారు.

అలగా జనం నివసించే పేటలో బహిరంగ సభ, వేదిక మీద మంత్రిగారు.

ప్రత్యక్ష ప్రసారం చేయడానికి టీవీ ఛానల్స్‌వారు. నివేదికలు రాసుకోడానికి విలేఖరులు.

వేదిక మీద మంత్రిగారి వెనక నలుగురు బాల కార్మికుల, వారి యజమానులూ కూర్చుని ఉన్నారు. గోపి, సుబ్బయ్యలను వాళ్ళతో కూర్చోమని పంపారు పోలీసులు. మంత్రి ఉపన్యాసం.

"పిల్లలు సదూకుంటే గొప్పోల్లయిపోతారు. ఆల్లని పనిలోపెట్టి పాడుసేయకండి. ఆల్లకి బంగారు బవిసత్తు ఇవ్వండి. పిల్లల్ని పనిలో పెట్టుకోడం నేరం. గోరం. ఆల్లని పనిలోకి పంపితే తలిదండ్రుల్ని జైల్లో పడేత్తాం. యజమానులకు ఫైన్ ఎత్తాం."

తర్వాత ఒక్కొక్క బాలకార్మికుని, అతని యజమానిని ముందుకు పిలిచి మందలించి పదివేలు జుల్మానా విధిస్తున్నట్టు మండలాధికారి ప్రకటించాక గోపి వంతు.

గోపి ముందుకొచ్చి రెండు ముక్కలు మాట్లాడడానికి మంత్రిగారి అనుమతి కోరి..

"అయ్యా! మా నాన్న రిక్షారాముడు. రిక్షా తొక్కి రోజుకు వంద రూపాయలు సంపాదించి అమ్మకిచ్చేవాడు. అమ్మకూడా నాలుగిళ్ళలో పాచిపని చేసి నెలకు మూడు వందలు తెచ్చేది. నేను స్కూలుకి వెళ్ళేవాడిని. చెల్లి ముద్దుముద్దు మాటలతో, సినిమాలు, షికార్లతో సరదాగా హాయిగా జీవించేవాళ్ళం." కాసేపు ఆగాడు గోపి. అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"మా పేటలో అందరూ బీదా బిక్కీ, కూలి నాలి జనమే. కొందరు తాగుబోతులున్నారుగానీ ఎక్కడో తాగి ఇంటికొచ్చి గొడవ చేయకుండా పడుకునేవారు. మా నాన్న తాగేవాడు కాదు. కాని ఆరు నెలల క్రితం మా పేట పక్కనున్న తోటలో దొంగసారా కాయడం మొదలుపెట్టాడు బంగారయ్య. మా పేట స్త్రీలు వెళ్ళి నిరసన తెలిపితే రౌడీలతో కొట్టించాడు. పోలీసులకు రిపోర్ట్ చేస్తే పట్టించుకోలేదు. బంగారయ్య మా పేట అంతా తిరుగుతూ సారా తాగని వాళ్ళకి ఫ్రీగా సారా పోయించి అలవాటు చేశాడు. మా నాన్నకీ ఆ అలవాటు అంటుకుంది. సంపాదించిందంతా తాగడం మొదలు పెట్టాడు. అమ్మ మందలిస్తే కొట్టడం మొదలు పెట్టాడు. సరదా కుటుంబంలో అరుపులూ, కొట్టుకోవడాలు, ఏడుపులూ ప్రారంభం అయ్యాయి.

కల్తీసారా తాగి మా నాన్న నెల రోజుల క్రితం చనిపోయాడు. పోలీసులు వచ్చి హడావుడి చేసి వెళ్ళిపోయారు. తర్వాత అంతా మామూలే. అమ్మ తెచ్చే డబ్బు సరిపోయేది కాదు. చెల్లి నీరసించి రోజు ఏడ్చేది. దాని ఆకలి తీర్చాక మిగిలిందేమైనా ఉంటే అమ్మా, నేనూ తినేవాళ్ళం. ఆకలిమంట ఎంతని ఓర్చుకోగలం? ఆకలి కడుపుతో చదువేం సాగుతుంది? మధ్యాహ్న భోజన పథకం వల్ల నాకు ఒక పూట ఆకలి తీరేది. మరి అమ్మకు, చెల్లికి ఎవరు పెడతారు? రాత్రి బువ్వ ఎలా? పోషణ లేక చెల్లి చచ్చిపోయే పరిస్థితి. నేను స్కూలు మానేసి సుబ్బయ్యగారిని పని ఇమ్మని కోరాను. చిన్న పిల్లాడికి పని ఇవ్వడానికి ఆయన సంశయిస్తే నేను కాళ్ళావేళ్ళా పడి, నిరాహారదీక్ష చేస్తానని బెదిరించాను. ఆయన పని ఇచ్చాడు. రోజుకు యాభై రూపాయలు జీతం. టిఫిన్, ఒకపూట భోజనం. "మా చెల్లి ఇంకా బ్రతికి ఉందంటే అందుకు కారణం సుబ్బయ్యగారే" అంటూండ

## కాస్త ఆలోచించండి!



కులం పేర కొట్లాటలు
మతం పేర మారణహోమాలు
జనజీవనం అస్తవ్యస్తం
అంతటా అభద్రతాభావం
దేవుడున్నాడో లేడోగాని
దేశప్రగతి అధోగతి
అజ్ఞానులు సరే!
విజ్ఞానులూ ఈ కొట్లాటలో
పాత్రధారులే
సర్వమతముల సారమొక్కటే
మనమంతా భారతీయులం అనే
మధురభావన ప్రతి ఎదలో
కదలాడిననాడు
శాంతి సుమసౌరభాలలో
భరతమాత పులకరించదా?
శాంతి సామరస్యంతో పుణ్యభూమి
పురోగమించదా?

– హైమవతీ సత్య

గానే గోపి గుండె చెరువు అయింది. కళ్ళు వర్షించాయి. గొంతు బొంగురు పోయింది. సభలో వున్నవాళ్ళ గుండెలూ బరువెక్కాయి. కొందరు కన్నీళ్ళు పెట్టుకున్నారు కూడా. కాసేపాగి గోపి కళ్ళు తుడుచుకొని గంభీరంగా మారిపోయాడు. మంత్రివైపు, పోలీసుల వైపు మార్చి మార్చి చూస్తూ..

“పిల్లల్ని పనిలో పెట్టుకోవడం నేరం అయితే దొంగసారా కాయడం, అమ్మడం కూడా నేరాలే. ఆ దొంగసారాయి వల్లనే మా బ్రతుకు బూడిద అయింది. అందుకే నేను పనిలో చేరాను. కడుపు నిండిన బాబులు పేరు కోసం, అవార్డుల కోసం ఎన్ని ఆదర్శాలైనా చెబుతారు. మీరెప్పుడైనా మా పేటకొచ్చారా? పరిస్థితులు చూశారా? ఒకపూట అయినా తిండి పెట్టారా? నేను పని మానేసి చదువుకోవాలంటున్నారే, అమ్మా, చెల్లీ ఎలా బ్రతకాలో చెప్పగలరా? మా అమ్మకొక ఉద్యోగం ఇప్పించగలరా?...

మీరు ఉద్యోగాలివ్వరు. అన్నం పెట్టరు. మా పాట్లు మేం పడి ఏదో కాస్త తింటూ వుంటే వద్దంటారు. ఎలా చచ్చేది?” ఆవేశంగా శర పరంపరగా గోపి కురిపిస్తున్న ప్రశ్నలకు వేదిక మీదున్న పెద్దలు నిశ్చేష్టులు అయ్యారు. సభికులు దిగ్భ్రాంతులయ్యారు. ఇదంతా టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతుంటే చూస్తున్న వీక్షకులు భలే, భలే అని గోపినీ మెచ్చుకుంటున్నారు.

గోపి తమాయించుకొని “ఇంక రెండే ప్రశ్నలు సార్. ఆ మధ్య ఒక కలక్టర్‌గారు తన ఇంట్లో పనిచేస్తున్న కుర్రాడు తన మీద విషప్రయోగం చేశాడని పోలీసులకు రిపోర్ట్ చేశారు. కుర్రాడిని పనిలో పెట్టుకున్నందుకు ఆ కలక్టర్‌గారికి మీరెంత ఫైన్ వేశారు? దొంగసారా కాచేవాళ్ళ మీద మీరు చర్య తీసుకుంటే నాకీ గతి పట్టేది కాదు. నా తండ్రి మరణానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. మీరు నాకు నష్టపరిహారం చెల్లించనక్కర లేదా? మీరు నాకు పరిహారం ఇవ్వకుండా, ఆ కలక్టర్‌గారిని శిక్షించకుండా సుబ్బయ్యగారినే శిక్షించే నైతిక హక్కు మీకు లేదు. బ్రతుకుల్ని బూడిదలు చేస్తున్న సారాని నిషేధిస్తే నేను, నాలాంటి పిల్లలెందరో స్కూళ్ళకి వెళతారు. సారాని నిషేధించగలరా?” ఆవేశంగా అరిచాడు.

సభలో ఉన్నవాళ్ళంతా సారా నిషేధించాలని అరిచారు. టీవీ చూస్తున్నవాళ్ళూ ఏకీభవించారు. *

(ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది. - ఎడిటర్)

